క్లుప్తంగా

ముగిసిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

మేళ్లచెరువు : మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి బాలబాలికల కబడ్డీ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. క్రీడల్లో గెలుపొందిన విజేతలకు కోదాడ రూరల్ సీఐ ప్రతాప్ లింగం బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నామా నర్సింహారావు, బసవయ్య, రామచంద్రరావు, అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.

ఐకార్ పీజీ ఎంట్రన్స్‌లో ఆలిండియా 88వ ర్యాంకు



వెలుగూరి పావని

గరిడేపల్లి : మండల పరిధిలోని వెలిదండ గ్రామానికి చెందిన వెలుగూరి వెంకట నరసింహారావు–కవిత దంపతుల కుమార్తె వెలుగూరి పావని అరుణాచల్‌ప్రదేశ్‌లో అగ్రికల్చర్ చదువుతుంది. ఇటీవల నిర్వహించిన ఐకార్ పీజీ ఎంట్రెన్స్ ఫలితాల్లో భారతదేశంలోనే 88వ ర్యాంకు, బీసీ కోటాలో 53వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పావనిని పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అభినందించారు.

మహాజన సోషలిస్టు పార్టీ మండల అధ్యక్షుడు మృతి



మిట్టగణుపుల మోష

నడిగూడెం : నడిగూడెం మండల పరిధిలోని చాకిరాలకు చెందిన ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడు మిట్టగణుపుల మోష (52) మూడు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ కోదాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున మృతి చెందాడు. ఈయన గతంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా కూడా పని చేశారు. ఆయనకు భార్య, ఒక కొడుకు ఉన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, కోదాడ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వేపూరి తిరుపతమ్మ, మాజీ ఎంపీపీ యాతాకుల జ్యోతి, టీపీసీసీ డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వేపూరి సుధీర్, యాతాకుల మధుబాబు, ఎంఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ పందిటి నవీన్ కుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు యాతాకుల రాజన్న, వల్దాసు జాని, చింత సతీష్, దంతా భిక్షపతి, కొండపల్లి ఆంజనేయులు తదితరులు శ్రద్ధాంజలిఘటించిన అనంతరం అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

సామూహిక వన భోజనాలు



వన భోజనాలకు వెళ్తున్న గ్రామస్తులు

చిలుకూరు: మండలంలోని నారాయణపురం గ్రామంలో ఆదివారం సాముహిక వన భోజనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గ్రామ దేవతలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామ శివారులోని పొలాల వద్దకు వెళ్లి వంటలు తయారు చేసుకుని సంపక్తి భోజనాలు చేశారు.

పోలీస్ ఈగల్ డిపార్ట్‌మెంట్ నుంచి ప్రశంసా పత్రం

నేరేడుచర్ల : హైదరాబాద్‌లోని క్షత్రియ హోటల్‌లో తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన యాంటి నార్కోటిక్స్ అవగాహన కార్యక్రమంలో ఇంపాక్ట్ క్లబ్ నేరేడుచర్ల హరివిల్లు శాఖ యాంటి నార్కోటిక్స్ సోల్జర్ వీర వెల్లి శ్రీలత ప్రశంసా పత్రం అందుకున్నారు. ఆదివారం ఇంపాక్ట్ పౌండర్ గంపా నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా అందుకున్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వలన వచ్చే నష్టాలు, యువత మత్తుకు బానిసై తమ జీవితాలను అస్తవ్యస్తం చేసుకుంటున్నారని, వాటి నుంచి ప్రతి ఒక్కరిని కాపాడుకునేందుకు కృషి చేయడంతో పాటు వారిలో చైతన్యం తీసుకురావాలని వివరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌పీ సంతోష్‌కుమార్, యాంటి నార్కోటిక్స్ ఇంచార్జీ వీరమల్లి శ్రీధర్, అడ్వైజర్ శ్రీనివాస్, సోను, ఆర్గనైజింగ్ సెక్రటరీ రామచంద్రుడు, నేషనల్ ట్రైనర్ మమత పాల్గొన్నారు.

దున్నపోతు విగ్రహం ప్రతిష్ఠాపన

మఠంపల్లి: మండలంలోని మంచ్యాతండా సమీపంలోగల దుబ్బలగట్టుపై బంగారు మైసమ్మ ఆలయంలో ఆదివారం గిరిజనులు జునా మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దున్నపోతు (మహిషం) విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. వేడుకల్లో స్థానిక గిరిజన పూజారులు, ప్రజాప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అమ్మవారి ఉత్సవాలను వచ్చే నవంబర్‌లో వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు తెలిపారు.

గాడితప్పిన పుర పాలన !

- అంధకారంలో కోదాడ పట్టణం
- ఉదయం కుక్కలు, కోతుల బెడద, రాత్రి దోమల మోత
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని మున్సిపల్ అధికారులు



వీధి దీపాలు వెలగక చీకటిగా మారిన పట్టణంలో ప్రధాన రహదారి



సాయికృష్ణ థియేటర్ వీధిలో పగలే వెలుగుతున్న వీధి దీపాలు

కోదాడ: పట్టణంలో పాలన గాడి తప్పింది. 80 వేల జనాభా ఉన్న కోదాడ మున్సిపాలిటీలో అధికారులు పనితీరు ఘోరంగా ఉందనే విమర్శలు పట్టణ ప్రజల నుంచి తీవ్రంగా వినిపిస్తున్నాయి. మున్సిపాలిటీలో అధికారుల తీరు ఎవరివారే యమునా తీరే అనే చందంగా మారింది. ఫిర్యాదులను పట్టించుకునేవారే కరువయ్యారని, తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని పట్టణ ప్రజలు వాపోతున్నారు. కోదాడ పట్టణంలో గడిచిన ఆరు నెలల నుంచి దాదాపు 50 శాతానికి పైగా వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో పట్టణం అంధకారంగా మారింది. మారుమూల గల్లీల నుంచి ప్రధాన రహదారి వరకు ఇదే పరిస్థితి. మరికొన్ని చోట్ల వీధి దీపాలు పట్టపగలే నెలల తరబడి వెలుగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు.

అధికారుల స్పందన కరువు..

కోదాడ పట్టణంలో గడిచిన ఆరు నెలలుగా వీధి దీపాల సమస్య తీవ్రంగా ఉంది. మున్సిపాలిటీలో వీధి దీపాల విభాగంలో పని చేసే నలుగురు హెల్పర్లను అధికారులు వేతనాలు ఇవ్వలేమని తొలగించారు. ఇక మిగిలిన నలుగురు ఎక్కడ పని చేస్తున్నారో.. ఏపని చేస్తున్నారో అర్థం కాని పరిస్థితి. దీంతో రాత్రి సమయంలో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని పలు వార్డుల్లో ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. నెలల తరబడి చిన్న సమస్యలు కూడా పరిష్కారానికి నోచుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కొద్ది నెలల్లో మున్సిపాలిటీకి ఎన్నికలు జరిగే అవకాశం ఉందని.. ఇదే పరిస్థితి మున్సిపాలిటీలో కొనసాగితే అధికార పార్టీకి ఇబ్బంది ఎదురవుతుందని పలువురు మాజీ వార్డు సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కడి సమస్యలు అక్కడే..

ఒక్క వీధి దీపాలే కాదు.. పట్టణ ప్రజలు పలు సమస్యలతో సతమతమవుతున్నారు. ఉదయం కుక్కల, కోతుల బెడద, రాత్రి దోమలతో ఇబ్బంది పడుతున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నా దోమల మందు ఫాగింగ్ చేసిన దాఖలాలు లేవు. ప్రధానంగా సీసీ రోడ్లపై గుంతలు పడి మట్టి రోడ్లను తలపిస్తున్నాయి. ప్రధాన కూడళ్ల వద్ద ఉన్న ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు నిలిచి బురదమయంగా మారి కంపు కొడుతున్నా అటువైపు కన్నెత్తి చూసిన అధికారి లేరు. ఇక పట్టణంలో ప్లాస్టిక్ నిషేధం మచ్చుకైనా కనిపించడం లేదనే విమర్శలున్నాయి.

సమర్థులైన అధికారులను నియమించాలి



కోదాడ మున్సిపాలిటీ ఏర్పడిన తరువాత ఇంత అధ్వాన పరిస్థితులను ఎప్పుడూ చూడలేదు. అసమర్థ అధికారుల వల్లే ఈ పరిస్థితి నెలకొంది. సమస్యలపై ఫిర్యాదు చేయడానికి కార్యాలయానికి వెళితే అధికారులు అందుబాటులో ఉండరు. ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయరు. ఎమ్మెల్యే జోక్యం చేసుకుని మున్సిపాలిటీలో సమర్థులైన అధికారులను నియమించి పట్టణ ప్రజల సమస్యలు పరిష్కరించాలి.

–ఎం.ముత్యాలు, కోదాడ

మఠంపల్లిలో డీఎంఆర్‌కేఎస్ సమావేశం



సమావేశంలో పాల్గొన్న సంఘం నాయకులు

మఠంపల్లి : మండల కేంద్రమైన మఠంపల్లిలోని రైల్వే స్టేషన్‌లో దక్షిణ మధ్య రైల్వే కార్మిక సంఘం కార్యాలయంలో మధిర రైల్వే కార్మికశాఖ సమావేశం ఆదివారం సౌత్ సెంట్రల్ రైల్వే జోనల్ డిప్యూటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కరీముల్లా యాదగిరి, సికింద్రాబాద్ డివిజన్ వైస్ ప్రెసిడెంట్ గానగాని వెంకట్‌ల అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా మధిరరైల్వే కార్మిక శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో మఠంపల్లి పరిధిలోని రామాపురం రైల్వే స్టేషన్‌లోఎంప్లాయీగా పనిచేస్తున్న సూర్యదేవర శ్రీనివాసాచారిని డీఎంఆర్‌కేఎస్ సెక్రటరీగా ఎన్నుకున్నారు. అదే విధంగా మధిర బ్రాంచ్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న టీ వీరభద్రం చైర్మన్‌గా, కాసర్ల రామకోటి కోశాధికారిగా, ఎల్ నరేష్ వైస్ చైర్మన్‌గా, డిప్యూటీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా జనార్ధనాచారి, సెక్రటరీలుగా రామక్రిష్ణ, నాగరాజు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసచారి స్థానికంగా మాట్లాడుతూ రైల్వే ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐకమత్యంగా ఉద్యమిస్తామన్నారు. అదేవిధంగా నూతన కార్యవర్గం రెండేళ్ల పదవీకాలంలో ఉంటుందన్నారు.

హామీలు నెరవేర్చాలి

నడిగూడెం : జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రోగ్రెసివ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏనుగుల వీరాంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం రామాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్కింగ్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డు, హెల్త్ కార్డు, ఇందిరమ్మ ఇళ్లు పెన్షన్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కరోనా సమయంలో ఇచ్చిన రైల్వే పాస్‌లు నిలిపివేశారని, మళ్లీ రైల్వే పాస్‌లు పంపిణీ చేయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి జర్నలిస్టుల సమస్యలపై లేఖ రాసినట్లు తెలిపారు.

ఇళ్లు, రేషన్ కార్డులు ఇవ్వాలి

హుజూర్‌నగర్ : కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను అన్నారు. ఆదివారం హుజూర్ నగర్‌లో సీఐటీయూ శాఖ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు ప్రమాదవశాత్తు చనిపోతే వారి కుటుంబానికి రూ10 లక్షలు ఇవ్వాలని, సహజ మరణానికి రూ 5లక్షల ఇవ్వాలని ఆయన కోరారు. సమావేశంలో తిరుపయ్య, శ్రీను, వెంకటమ్మ, గోపమ్మ పాల్గొన్నారు.

బీటీ రోడ్డు వేయాలి



భీల్యానాయక్‌తండాలో బురదమయంగా ఉన్న రోడ్డును పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

మఠంపల్లి : మండలంలోని బీల్యానాయక్‌తండాలో బురదమయంగా మారిన ప్రధాన రోడ్డును బీటీగా మార్చాలని బీజేపీ గిరిజనమోర్చా జిల్లా నాయకులు బానోతురంగా నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మండల బీజేపీ నాయకులతో కలిసి బురదమయంగా ఉన్న రోడ్డును స్థానికంగా పరిశీలించి మాట్లాడారు. ఐదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం బిల్యానాయక్‌తండా పంచాయతీకి నేరుగా లక్షల రూపాయల నిధులు విడుదల చేసిందన్నారు. అయితే గత పాలకులు అవసరంలేని చోట రోడ్లు వేసి ప్రధాన వీధులు, రహదారిని బీటీ చేయించడంలో నిర్లక్ష్యం చేయడం వలన బురదమయంగా తయారైందన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ మాజీ అధ్యక్షుడు దుంగాల ఎల్లయ్య, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు ఆరాల సైదులు, భీల్యానాయక్‌తండా గ్రామ శాఖ అధ్యక్షుడు ధరావత్ చిక్కుబాబునాయక్, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా నదిలో మహిళ గల్లంతు

మేళ్లచెరువు: చింతలపాలెం మండలం చింత్రియాల గ్రామ పరిధిలో ఆదివారం కృష్ణా నదిలో పడి మహిళ గల్లంతైంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చింత్రియాల గ్రామానికి చెందిన బడుగుల సైదమ్మ(52) గేదెలు మేపేందుకు గ్రామ పరిధిలోని కృష్ణా నది సమీపంలోకి వెళ్లింది. ప్రమాదవశాత్తు నదిలో పడి గల్లంతైంది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు నదిలో రాత్రి వరకు గాలించినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు.

ఆర్థికసాయం అందజేత

కోదాడరూరల్ : గణపవరం గ్రామానికి చెందిన పాలపాటి వెంకటేశ్వర్లు శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం అతడి మృతదేహాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి అంత్యక్రియల నిమిత్తం కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఇర్ల సీతారాంరెడ్డి, మాజీ దేవాలయ చైర్మన్ ఇర్ల నారపరెడ్డి, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ పాపిశెట్టి సత్యనారాయణలు రూ.5వేలను మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

మనస్సుపై నియంత్రణ కలిగి ఉండాలి



మాట్లాడుతున్న భగవద్గీత ప్రచారకుడు శ్రీపతి ప్రభువు

హుజూర్‌నగర్ : ప్రతి ఒక్కరూ ధర్మాన్ని ఆచరించాలని, మనస్సుపై నియంత్రణ కలిగి ఉండాలని ఇస్కాన్ మందిరం ప్రవచన వక్త, భగవద్గీత ప్రచారకుడు ప్రభుజీ శ్రీపతి ప్రభువు అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్‌లోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి సత్రంలో భగవద్గీత సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భగవద్గీత గురించి వివరించారు. మనస్సు చంచలమైనదని అన్నారు. మనస్సుకు మూడు ప్రధాన లక్షణాలు ఉన్నాయని.. అవి ఆలోచించడం, భావాలను వ్యక్తం చేయడం, కోరికలు కోరడం అని చెప్పారు. అటువంటి మనస్సుపై నియంత్రణ కలిగి ఉండాలని అన్నారు. అనంతరం మహిళలచే లలితా పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రసాదం దాతలు సీహెచ్ నాగేశ్వరరావు, నిర్వాహకులు శ్రీమన్నారాయణ, వి.చంద్రశేఖర్, కె.శ్రీనివాసరావు, ఎ.ఆంజనేయులు, సతీష్, శ్రీను, నాని, రాధాకష్ణ, వి.నాగేశ్వరరావు, వెంకట్ నారాయణ, గోపీచంద్, చంద్రశేఖర్, సుజాత, నాగలక్ష్మి, సౌజన్య, గాయత్రి, రజిత, వెంకటలక్ష్మి, శ్రీదేవి, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే సమాజానికి మార్గదర్శకులు



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న వాకర్స్‌క్లబ్ సభ్యులు, క్రీడాకారులు

కోదాడ: ఉపాధ్యాయులే సమాజానికి మార్గదర్శకులని పలువురు వాకర్స్‌క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనా బాలుర పాఠశాల ఉపాధ్యాయులను ఆదివారం కోదాడ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో వాకర్స్‌క్లబ్ సభ్యులు, క్రీడాకారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బాలుర పాఠశాల మైదానంలో వాకర్స్‌కు, క్రీడాకారులకు ఇక్కడి ఉపాధ్యాయులు అందిస్తున్న సహకారం మరువలేనిదని అన్నారు. సన్మానం పొందిన వారిలో ముక్కామల జానకిరామ్, బడుగుల సైదులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ మండల విద్యాధికారి సలీంషరీఫ్, వాకర్స్‌క్లబ్ సభ్యులు, వాలీబాల్ క్రీడాకారులు తదితరులు ఉన్నారు.

వర్షాలకు నీట మునిగిన పొలాలు



చిలుకూరు : చిలుకూరులో గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చెరువు అలుగు పోసి అంతర్గంగ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో వాగు చుట్టుపక్క పొలాలు నీట మునిగాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఎస్‌కె యాకూబ్

గరిడేపల్లి : తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్‌కె యాకూబ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని తాళ్లమల్కాపురం గ్రామంలో సీపీఎం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయుధ పోరాటంలో ఈ ప్రాంతం చారిత్రకమైన పాత్ర పోషించిందన్నారు. ఈ నెల 17న సూర్యాపేటలో నిర్వహించే వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తుమ్మల సైదయ్య, మండల కమిటీ సభ్యులు దోనపాటి భిక్షం, పటాన్ మైబెల్లి, మాజీ సర్పంచ్ హేమగాని వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ యానాల సుశీల, మండవ సైదులు, మచ్చ గుర్వయ్య, లక్ష్మీనారాయణ, బాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాములు

మునగాల : తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 16న మండలంలోని జగన్నాథపురంలో నిర్వహించే సాయుధ పోరాట అమరవీరుల సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ సభకు సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు బచ్చలకూరి స్వరాజ్యం, పలువురు మండల కమిటీ సభ్యులు, కార్యదర్శి వర్గ సభ్యులు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో మండల కమిటీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం

హుజూర్‌నగర్ : మండలంలోని అమరవరం జెడ్పీహెచ్ఎస్‌లో హిందీ టీచర్‌గా పనిచేస్తున్న పట్టణానికి చెందిన బోళ్ల కవిత ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు అందుకున్నారు. దీంతో ఆదివారం ఆమెను పదో వార్డు చెందిన వినాయక కమిటీ సభ్యులు శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వినాయక కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల తోడ్పాటు

తిరుమలగిరి : తిరుమలగిరిలోని పాఠశాలకు పూర్వ విద్యార్థులు తమకు తోచినంత సహాయం చేస్తున్నారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన వాటర్ ప్లాంట్, మైక్‌సెట్‌లను బహూకరించారు. తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1969–70 సంవత్సరంల పదవ తరగతి పూర్వ విద్యార్థులలో సంకెపల్లి నర్సింహారెడ్డి వాటర్ ప్లాంట్‌ను, కోదూరు సరళాదేవి మైక్‌సెట్‌ను పాఠశాలకు అందజేశారు.

బాధితులను ఆదుకోవడానికి ప్రభుత్వం సిద్ధం



లబ్ధిదారులకు చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

కోదాడ: అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న బాధితులను ఆదుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటుందని కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి తెలిపారు. ఆదివారం కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసిన అనంతరం ఆమె మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాలతో పాటు కోదాడ పట్టణానికి చెందిన 267 మంది లబ్ధిదారులకు 87,78,500 రూపాయల విలువైన చెక్కులను ఆమె పంపిణీ చేశారు.

దేశ చరిత్రలో నిలిచిపోయే గొప్ప పోరాటం



హుజూర్‌నగర్ : స్మారక స్థూపం వద్ద జోహార్లు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

హుజూర్‌నగర్ : దేశ చరిత్రలో నిలిచిపోయే గొప్ప పోరాటం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా హుజూర్‌నగర్‌లోని అమరుల స్మారక స్థూపాల వద్ద నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు చూపిన ధైర్యం, నిబద్ధత, త్యాగనిరతి ప్రజలకు ఎప్పటికీ స్ఫూర్తినిస్తుందన్నారు. నైజాం నవాబుల నిరంకుశ పాలన, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా దేశ చరిత్రలోనే గొప్ప పోరాటం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం అని కొనియాడారు. సీపీఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, కొప్పోజు సూర్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీను, దేవరం మల్లేశ్వరి, కందుల వెంకటేశ్వర్లు, సోమగాని కృష్ణ, దొంతగాని సత్యనారాయణ, యల్లావుల రమేష్, ఇందిరాల వెంకటేశ్వర్లు, జడ వెంకన్న, చెనగాని సైదులు, యల్లావుల ఉమా తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టులో పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలి



హుజూర్‌నగర్ : సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

హుజూర్‌నగర్ : కాంగ్రెస్ ఎమ్మెల్యే తెలగం వెంకట్రావ్, కాంగ్రెస్ నాయకులు సోయం బాబురావులు లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని సుప్రీం కోర్టులో వేసిన పిటిషన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని లంబాడీ జేఏసీ ముఖ్య నాయకుల డిమాండ్ చేశారు. ఆదివారం హుజూర్ నగర్‌లో లంబాడీ జేఏసీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టికల్ 342 ద్వారా రాజ్యాంగం బద్ధంగా ఎస్టీ జాబితాలో చేర్చబడిన లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని సుప్రీం కోర్టులో పిటిషన్ వేయడం హేయమైన చర్య అన్నారు. ఈ విషయమై హుజూర్ నగర్‌లో సెప్టెంబర్ 17న నిర్వహించే నియోజకవర్గ స్థాయి లంబాడీ ఆత్మగౌరవ మహార్యాలీకి పార్టీలకతీతంగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నగేష్ రాథోడ్, జి కృష్ణ నాయక్, జగన్ నాయక్, డాక్టర్ మోహన్ రావు, నాగరాజు, శ్రీను, బాలు, సందీప్, చంద్రమౌళి, శంకర్, నాగు, రాంబాబు, నాగరాజు, భాష్య, సిపాయి, నర్సింహా, వెంకటేశ్వర్లు, నారాయణ పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే



అమరవీరుల చిత్రపటాలకు నివాళులు అర్పిస్తున్న అఖిలపక్షం నాయకులు

మునగాల: తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులేనని సీపీఐ మండల కార్యదర్శి చిల్లంచర్ల ప్రభాకర్ అన్నారు. ఆదివారం మునగాల మండల కేంద్రంలోని చిల్లంచర్ల రఘునాథం స్మారక భవనంలో సీపీఐ మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను మండల కార్యదర్శి చిల్లంచర్ల ప్రభాకర్ ఆవిష్కరించారు. అనంతరం అమరవీరుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం వల్లే పోలీస్ యాక్షన్, భూస్వామ్య వ్యవస్థ పతనమైందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు రాఘవరెడ్డి, సాలె రవి, శివ, కొండమీది శ్రీను, దేశగాని శ్రీను, జక్కుల శేఖర్, సీపీఎం పార్టీ నాయకులు బుర్రి శ్రీరాములు, బచ్చలకూరి స్వరాజ్యం, స్టాలిన్‌రెడ్డి, టీఆర్ఎస్ నాయకుడు కందిబండ సత్యనారాయణ పాల్గొన్నారు.

తెల్లబల్లిలో యూరియా కోసం ఎగబడిన రైతులు



తెల్లబల్లి సహకార సంఘం వద్ద గుంపులుగా ఉన్న రైతులు

నడిగూడెం : నడిగూడెం మండల పరిధిలోని తెల్లబల్లి సహకార సంఘంలో ఆదివారం యూరియా కోసం రైతులు ఎగబడ్డారు. ఆ సంఘానికి 444 యూరియా బస్తాలు వచ్చాయని రైతులకు తెలియడంతో ఉదయం ఆరు గంటల నుంచే తెల్లబల్లి, వాయిలసింగారం గ్రామాలకు చెందిన అనేక మంది రైతులు బారులు దీరారు. ఒక్కో రైతుకు ఒకబస్తా చొప్పున అధికారులు పంపిణీ చేశారు. దీంతో అనేక మందికి యూరియా అందకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. ముందు వచ్చిన రైతులకు ఇవ్వకుండా వెనుక వచ్చిన వారికి, ఇష్టం వచ్చిన వారికి సిబ్బంది యూరియా పంపిణీ చేశారని పలువురు రైతులు ఆరోపించారు.

గ్రీన్ క్లబ్ ట్రస్ట్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు

సూర్యాపేట : గ్రీన్ క్లబ్ ట్రస్టు ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆ ట్రస్టు అధ్యక్షుడు ముప్పారపు నరేందర్ పేర్కొన్నారు. ఆదివారం జమ్మిగడ్డలోని శివ సాయి పిరమిడ్ కేంద్రంలో గ్రీన్ క్లబ్ ట్రస్ట్ తొమ్మిదవ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రీన్ క్లబ్ ట్రస్టు ద్వారా ఎన్నో ఏళ్లుగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మొక్కలు నాట డం – సంరక్షించడం, భూ, జల, వాయు కాలుష్యం నివారించడం, సింగిల్ యూస్ ప్లాస్టిక్ కవర్లు వాడకుండా ప్రజల్లో చైతన్యం కల్పించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. గ్రీన్ క్లబ్ ట్రస్ట్ గౌరవ సలహాదారుడు శశిధర్ మాట్లాడుతూ దేశ విదేశాల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, గ్రీన్ క్లబ్ ట్రస్టు ఉపాధ్యక్షురాలు మారం పవిత్రను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లబ్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ తోట కిరణ్, సుధాకర్ పీవీసీ మేనేజింగ్ డైరెక్టర్ మీలా మహదేవ్, బొలిశెట్టి మధు, మిర్యాల వెంకటేశ్వర్లు, సోమా హేమమాలిని, బందు శ్రీధర్, అనంతర సువర్ణ, తిరుక్ల సాయి రెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్రీదేవి పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవాలు

ఆత్మకూర్(ఎస్) : మండల పరిధిలోని గట్టికల్ గ్రామంలో గల లింగమంతుల స్వామి ఆలయంలో గత ఏడాది ప్రతిష్ఠించిన మల్లన్న దేవుడు, కేతమ్మ, మేడలమ్మ, గంగాదేవి, చౌడమ్మ, ఎలమంచమ్మ విగ్రహాలకు ఆదివారం ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.